# ముదిత



వినగానే ఆశ్చర్యపోయాను. ఆమె అడిగిన తీరుకు తల పంకిస్తూ సాభిప్రాయంగా ఆమె కేసి చూశాను.

తను గలగల మాట్లాడుతూనే, నాగురించి అడుగుతూ... సమాధానం చెప్పే లోగానే మరో ప్రశ్న.. గవ్వల పోదలా... ఆ సాయంత్రం, మల్లెవాసనలా... చేతిలో కూరల సంచీతో, దేశ్ ముఖ్ కాలనీ దగ్గర కుడివైపునకు తిరుగుతూ, ఆగి నాకేసి చూసింది. కుడి కనుబొమ వంపులో వాలిన ప్రశ్న పిట్ట... అపనమ్మకం? రెక్కలు టపటపమంటూ ఎగిరిపోయింది, సమాధానమదే అన్నట్లుగా... నాముఖంమీంచి మబ్బు విడిపోయింది. నల్లని మెరిసే కన్నులతో చేతిలోని గులాబీకేసి ఓసారి చూసి, యిసక్కాయితంలాంటి నా అరచేతిలో పెట్టి, ఉషోదయానికి ముందు వేకువలా ఆమె వెళ్ళిపోయింది.

నేను తెప్పరిల్లేసరికి, చీకట్లు పరచుకుంటున్నాయి పల్చగా.

ఆమె వెళ్ళేవైపు చూశాను. చుక్కలా, దూరంగా సాగిపోయి, అదృశ్యమయిపోయింది. వాస్తవంలా బరువుగా వున్న గులాబీని రెండువేళ్ళ మధ్య పొదవుకున్నాను సుకుమారంగా!

** ** **

నిరుద్యోగ పర్వంలో, నగరం రోడ్లపై కాళ్ళరిగేలా ఉద్యోగం కోసం నేను తిరుగాడుతున్న వేళల్లో, ఆమె ఈ భూప్రపంచకంతో నాకేమిటనేటట్లుగా పుస్తకాలను ఆ చేతిలోంచి ఈ చేతిలోకి విలాసంగా మార్చుకుంటూ కాలేజీకి వెళ్ళేది. తన చెలికత్తెలు వెంటరాగా...!

ఏదో చిన్న ఉద్యోగంతో నేను వొంటి కాలితో కుంటుతున్నప్పుడు, ఆమె నడకల్లో వచ్చిన అణుకువ కొంత తెచ్చి పెట్టుకున్నట్లుండేది.

నగరంలో పేద్ద ఫేక్టరీకి, విశాఖలో ఉన్న బ్రాంచి ఆఫీసులో ఉద్యోగముందంటే వెళ్ళి రెండు కాళ్ళూ నిలదొక్కుకునేంతలో మళ్ళీ రాజధానికి బదిలీ అన్నారు.

ఒకనాటి సాయంకాలం ఆమె రవీంద్రభారతిలో పలకరించింది. అన్నాళ్ళ పరిచయంలో అదే మొదటిసారి, అసలది పరిచయం అనొచ్చా? అనే సందేహం ఇప్పటికీ నాకు.

ఆ తర్వాత చాలాకాలానికి మళ్ళీ ఆబిడ్సులో కనబడి, తెల్లగా పైజమా లాల్చీలో ఉన్న 'శ్రీధర్ని' భర్తగా పరిచయం చేసింది. పల్చగా నవ్వుతూ, చేతులు జోడించాడతను.

నా గురంచతనికి ఏమి చెప్పిందో, చాలా నమ్రతగా మాట్లాడాడు. తెల్లని పిండిబొమ్మకు గులాబీరంగు పెదవులంటించినట్లుగా, అతగాని నవ్వు, తెలతెలాపోతూందనిపించింది.

మరొకసారి రాత్రి పదిగంటలవేళ అనుకుంటా, స్నేహితుడొకరు హాస్పటల్లో ఉన్నాడంటే వెళ్ళాను. అక్కడ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ దగ్గర కూర్చుని కనిపించిందామె!

అప్పుడు కూడా మెరిసే ఆ నల్లని పెద్ద కన్నుల్లో పరచుకున్నది కేవలం దైన్యమే తప్ప, అధైర్యం కానీ, నిర్లిప్తత కానీ లేశమాత్రం నాకంట పడలేదు. ఏం కష్టాలు పడిందో ఏమో... త్వరలోనే కోలుకున్నట్లున్నాడు శ్రీధర్.

ఆ తర్వాత... ఇన్నాళ్ళకు... ఇదిగో... ఇందాకే కనపడడం... మళ్ళీ ఆమె తాలూకు జ్ఞాపకం నా పెదవులపై సన్నగా మెరిసింది. తదియనాటి వెన్నెలరేకలా.

** ** **

"ఏం నిద్రపోలేదా, రెండురోజుల నుంచీ" అన్నట్లు నన్ను చూడగానే మువ్వలు విసిరినట్లు కనురెప్పలల్లారుస్తూ... పలకరింపుగా ఆమె!

అదేంకాదన్నట్లు తలూపుతూ,.... అప్పుడు చూసానామెను... మంచిగంధం రంగుచీర, పసుపు వెన్న కలిపిన శరీరఛాయ మీద చక్కగా అమరినట్లుంది. సన్నగా వున్న నాసిక మీద ఎర్రటి ఒంటిరాయి ముక్కుపుడక...

"అయిందా పరీక్షించడం" అన్నట్లుగా కళ్ళు నవ్వుతున్నాయి గొప్ప కాన్ఫిడెంటుగా. అల్లరిగా పెదాలు బిగించినా వినపడే నవ్వు తెరలుతెరలుగా... వర్తమానానికి అద్దిన ఉషోదయంలా ఆమె ఉనికి.

నవ్వుతున్న ఆ పెద్ద కళ్ళల్లో జ్ఞాపకాలు పురివిప్పినవేళ... ఆమె కాలేజీ కబుర్లూ, అక్కడి పరిచయాలూ... ఆ పరిచయాలు పెరిగి పెద్దవటం, తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా, తను కావాలనుకున్న వ్యక్తిని పెళ్ళిచేసుకోవడం, అందరినుంచీ వెలి అయి, బతకడం కోసం పడ్డ పాట్లూ నిత్యకృత్యంలో సమన్వయం కుదరని ఆదర్శాలూ, అవమానాలూ, అవహేళనల మధ్య అనారోగ్యాలూ, కనీసాల్లోనే అయినా, నశేషాలుగా మిగలని ఆశలూ, ఆప్యాయతల పూలుపూచే నీలిగోరింటలూ, స్వగతాలెరుగని సాయం సమయాల్లో షికార్లూ, తదితరాలన్నీ చక్కని పాజ్‌తో చెప్పింది.

కేవలం శ్రోతనయ్యాను. ఆమె సమక్షంలో... "ఏమిటీ, ఎంతసేపూ, నేను మాట్లాడడమేనా? పాపం, నీకు మాటలు రావా... మౌనాన్ని ఆరాధించడం తప్ప" కాఫీ కలుపుతూ అందామె.

లక్ష్మీనారాయణ

అప్పుడామె కళ్ళల్లోని విచిత్రమైన మెరుపు బుగ్గలపైపాకి, ట్యూబ్ వెలుతుర్లా పరచుకుంది. నిండువెన్నెల్లా.

ఇల్లంతా తిరిగి అన్నీ చూస్తూ- ఇదెక్కడ కొన్నావ్, అదెక్కడ నుంచి సంపాదించావంటూ స్టాక్ స్క్రూటినీ చేసి తలపంకిస్తూ సోఫాలో కూర్చుంది.

"ఇదేమిటీ, ఈ ఫ్రేమ్‌లో ఏమీ పెట్టలేదేం" అందామె నాకేసి తిరిగి విచిత్రంగా కళ్ళెగరేస్తూ... ఎదురుగోడ మీద వెళ్ళాడే ఖాళీగా వున్న ఫోటోఫ్రేమ్‌ని చేతిలోకి తీసుకుని, అద్దంమీద చేత్తో తుడుస్తూ... అప్పుడామె చేతికున్న గాజులు వింతగా సంభాషించాయి.

"ఫోటోలు ఆకారాన్ని చెప్తాయి. కానీ, అంతరంగాన్ని కాదు" ఆ ఫ్రేమ్‌లోని వాక్యాన్ని పెద్దగా చదివి, విచిత్రంగా కళ్ళెగరేస్తూ.

"అబ్బా! ఇదంతా భావుకత్వంలా వుందే!" అయినా, అలా ఆలోచించడం మాకు రాదు బాబూ" సిన్సియర్‌గానే అన్నా, ఆ గొంతులో అల్లరి... కన్పించకుండా.

"మరీ... అలా తామరాకుమీది నీటిబిందువులా వుండకు... నాకు బావుండదు. ముఖ్యంగా... ఆడపిల్లల దగ్గర" బీరువా పక్కనగల టేబుల్ మీది గులాబీని గ్లాసుతోసహా చేతిలోకి తీసుకుని, ఆ గ్లాసు నీళ్ళలోంచి నాకేసి చూస్తూ అందామె.

ఆ తర్వాత పెరట్లోకి వెళ్ళికూర్చుంది. చాలాసేపు, శూన్యంలోకి చూస్తూ.

ఏమి ఆలోచిస్తూందో ఏమో!

టైంచూశాను, నాలుగున్నర చూపిస్తోంది.

"బయల్దేరదామా" అందామె నా వెనగ్గా వచ్చి.

ఆ గొంతులో 'జీర' స్పష్టంగా తెలుస్తోంది.

వెంటనే... క్షణంలో సగంపైగా....!

"అన్నట్టు ఫోనుందా అనడిగింది" ఫ్రిజ్‌లోంచి సీసాతీసి నీళ్ళు తాగుతూ.

"శ్రీధర్‌కు ఫోన్ చెయ్యాలా"

అవునన్నట్లుగా తలూపుతూ, ఫోన్ తీసి- "యెస్! ఎనీ అబ్జెక్షన్" అంది పెదిమలు బిగపట్టి... నల్లగొను తొడుక్కోకున్నా... చేతిలోని పెన్ సూటిగా నాకేసి చూపిస్తూ... అంతే... అప్పటి

వరకూ వున్న సీరియస్‌నెస్ దూదిపిం జలా ఎగిరిపోయింది. అది... అది... ఆమెకు మాత్రమే తెలిసిన విద్య...!

ఆమె... ఆ పెద్దకళ్ళు... ఎటువంటి క్లేశమూ అంటని, అసలా ఛాయలేవీ లేని స్నిగ్ధ సుహాసినీ సుమాలు మాత్ర మే అనిపించింది.

"నీ మౌనం చాలా పదునైంది"... నా కళ్ళలోతుల్లోకి చూస్తూ... "మంచు కత్తి తెలుసా? అటువంటిది, గాయం కనపడదు... కానీ... ప్రాణం వుండదు, పత్రహరితం కోల్పోయిన ఆకుల్ని చూసావా, అటువంటిదె అన్నమాట" కళ్ళు దించుకుని, లిబర్టీ దగ్గర అయిస్ క్రీమ్ తింటూ, మెనూ చూస్తున్నట్లు గా... అందామె.

ఆ గొంతులోని గాంభీర్యం, తెచ్చి పెట్టుకున్నట్లుగా అనిపించలేదుకానీ...

"మనం మళ్ళీ కలుసుకోం బహుశా, ఎందుకంటే మేం ఈ నెలాఖరుకే విశాఖ వెళ్ళిపోతున్నాం, అక్కడ శ్రీధర్ ఏదో వ్యాపారం చేస్తానంటున్నారు, వాళ్ళ స్నేహితులతో కలిసి నిజానికి ఈరోజు నిన్ను కలవాలని, తనుకూడా వస్తానన్న మనిషే, రాత్రి అత్యవసర పనిమీద మద్రాసు వెళ్ళారు."

"నీ కళ్ళ లోయల్లోని కేన్వాసుమీది పచ్చని మైదానాలపై దోబూచులాడే సమాధానం తెలీని ప్రశ్నల యవనికలు చూడ్డం శ్రీధర్‌కి కూడా యిష్టం, యీ విషయం నాతో చాలాసార్లు అన్నారు కూడానూ..."!

"చిత్రమేదీ పూర్తికాని నేపథ్యంలో... వర్తమానానికి అద్దిన జ్ఞాపకాల్లా కరిగిన వెన్నెల జడికి కరగని మంచుశిల్పంలా మాత్రమే... నీ ఉనికి" అందామె ఆటో బయలుదేరుతూండగా...

"నీ మౌనం మాత్రం వెంటాడుతూం టుంది ఎల్లవేళలా... చరణంలేని పల్ల విలా..." అలా మాట్లాడుతూండగా నే... బరువైన వర్తమానం మీద కార్బన్ పొగల తెరలు పరుస్తూ... ఆటో వెళ్ళి పోయింది. ఆఖరి వాక్యం వినబడలేదు ఆటో శబ్దంలో కలిసి...

ఉక్కిరిబిక్కిరి అయిపోయాను ఒక్క సారిగా! ఆటో ఉదారంగా విరజిమ్మిన విషపు పొగ శ్వాసించడం వలనా, లేక ఆత్మీకరించిన ఆమె మాటల బరువును తూచలేకనా... సందిగ్ధంగానే ఆమె వెళ్ళిన వైపు చూసాను.

కాలం సరిగ్గా అరవైనాలుగ్గంటలు వెనక్కి తిప్పగలిగితే... ఎంత బాగుం టుందనిపించింది.

ఆమె వెళ్ళిన మరుక్షణం,

కారణం స్ఫురించలేదు,

కానీ... ఆమె సమక్షంలో నేను మాటలురాని మూగనైపోతున్నాను.

**"ఇదేమిటీ, ఈ ఫ్రేమ్‌లో ఏమీ పెట్ట లేదేం" అందామె నాకేసి తిరిగి విచి త్రంగా కళ్ళెగరేస్తూ... ..మరుగోడ మీద వేళ్ళాడే ఖాళీగా వున్న ఫోటో ఫ్రేమ్‌ని చేతిలోకి తీసుకుని, అద్దం మీద చేత్తో తుడుస్తూ... అప్పుడామె చేతికున్న గాజులు వింతగా సంభా షించాయి.**

ఆ... నా... మౌనం నన్ను గొప్ప నిరాశకు గురిచేస్తోంది.

ఆ హిమశృంగ ఔన్నత్యం ముందు నేను పసివాడిలా మోకరిల్లి మూర్ఛిల్లు తున్నాను.

నన్ను నేను ఏకాంతంలో ఎన్నోసార్లు లిట్మస్ పరీక్షకు గురిచేసుకున్నాను. సమాధానంగా రంగుమారని స్వచ్ఛత నం, నా మనస్సుకు స్వాంతనిచ్చేది, ఆ క్రమంలో ఈ జ్ఞాపకాలు రిలీఫ్‌గా అని పించేవి... ఆమె ఉదాత్తతకు మౌనం గానే నమస్కరించేది. వర్తమానం కను రెప్పల సందుల్లోంచి జారిపోతున్న కాలం వునికిని నిరూపించుకునే క్రమంలో జ్ఞాపకాలు, గతం రగ్గు కప్పు కున్న మల్లెల వాసనలయ్యాయి.

ఆ సాయంత్రం, అహోబల మఠం అరుగు మీద ఉష్ట్రపక్షిలా వున్నాను.

జేగురు రంగులోకి మారిన సూర్యుడు క్రమంగా కనుమరుగవుతూంటే, నీడ లు పొడుగవుతున్నాయి. చీకటి విరులు పరచుకుంటున్నాయి, అగరుపొగల్లా ఆవరణంతా...

సాంబ్రాణి పొగల్లో దాగున్న జ్ఞాపకాలు ముప్పిరికొన్నాయి ఒక్కసారిగా...!

ఆమె... సందేహం!

ఆమె... సందో హం!!

అవును... మళ్ళీ... ఇక్కడ ఆమె!!!

కానీ... ఇక్కడ... మళ్ళీ ఆమె!!

అవును... ఆశ్చర్యం!



వాస్తవం చెబుతోంది కలకాదని ఇదే మిటీ... ఆమె... ఆమె నల్లని ఆ పెద్ద కళ్ళు... అలసి... వాడిపోయు న్నాయి... దైన్యంతో!

చిరుగాలి సవ్వడికే కరిగిపోయే వాన మబ్బుల్లా... ఆ కళ్ళు!

ఆ నల్లని పెద్ద లోగిళ్ళు!!

పట్టీలు లేని ఆ పాదాలు.

నాముందు బోసిగా... తప్పమ్మా తప్పు!! ఇది... ఇది నిజంకాకూడదు.

కూడదు... డదు... దు... కానీ... ఇదే నిజం... నిజమంటూ... గుళ్ళోని పూజారి గొంతెత్తి చదివే వేదమం త్రాలు... కానీ ఆ విగ్రహం... మౌనంగా... నాలాగే... ఎప్పట్లానే!

ఆ... తడి... కన్నుల్లో... ఆశ... సంశయం.. పరచుకుంది.. తనువంతా వెలవెలబోతూ... తత్తరపడుతూ... అబ్బురపడుతూ... తదేకంగా... నిలు వెత్తు ఆమె... ముంగిట... మౌనంగా...

శరీరమంతా చిరుకంపన-

వాలిన ఆ కనురెప్పల్లో కదలాడే గతం బరువుగా...! స్నిగ్ధంగా నవ్వే ఆ సుహాసినీ సుమాల్లో పల్లేర్లద్దిన విధి క్రూరత్వం.

ఆ కనుపాపల్లో నిర్మలంగా కదలాడే శ్రీధరాలు... వాడి వత్తలైన అవశేషా లు... నా కళ్ళలోయల్లో శోధిస్తున్నాయి. సశేషాలైన నిన్నటితనాలు!

అనిమేషాలైన కనుతుదలకద్దిన తడి జ్ఞాపకాల మరకలకంటిన, స్పందనల జడి... వెలుతురద్దిని వర్తమానానికి కర్పూరహారతి!

వెల్లువ మరచిన అలవాణి, కర్పూర ఉదకంతో తడిసి కన్నులకద్దిన ముగ్ధ మందారం, భక్తితో కురుల ముడుస్తూ అలవోకగా రువ్విన నవ్వు!

మఠంలో జేగంటలు నిర్విరామం గా... అస్పష్టంగా కదులుతున్నాయి... మ్రోగుతున్నాయి... పెదవులు...

ప్రశ్నవేసిన కళ్ళే సమాధానంగా చిర్నవవీయి ఆమె అడిగింది కేవలం... నీ భార్య ఎలా వుంటుందో తెలీదు... కానీ... కనీసం ఆమె ఫోటో అయినా చూపించకూడదా... అనే!

మౌనాన్ని తాగితాగి మత్తిల్లిన మల్లెలూ! ముంగిట్లో రాలిపడిన మంచు పూలు!! తొంగిచూసే జాబిలి పరచిన వెన్నెల వానలూ!

గుండెకింది తడిఆరని జ్ఞాపకాలూ!!

ఇవన్నీ సొంతమంటూ పరవశత్వం తో పాడే పెదాలూ... వెరసీ జీవితం...

ఆ గదిలో వేళ్ళాడే ఫోటోఫ్రేమ్‌లో గల వాక్యం కనబడకుండా, ఆమె కళ్ళ ల్లోని మెరుపు అద్దంమీంచి పరావర్త నం చెంది ఇల్లంతా పరచుకుంది.

ఇక ఆ ఫోటోఫ్రేమ్ ఖాళీగా వుండ దని నేను చెప్పేలోగానే ఆమె దాన్ని చేతుల్లోకి తీసుకుని తన ముఖం చూసుకుంది.

మనసు మల్లె పందిరయ్యింది.

ఆ విషయం ఆమెకు తెలుసునని నేననుకొనే లోపలే జీవితంలో రంగు లన్నీ మారిపోయాయి.

